క్లుప్తంగా

పౌరహక్కులపై అవగాహన తప్పనిసరి



చినబొడ్డేపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దారు జానకమ్మ

కోటవురట్ల: భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతీ ఒక్కరూ కలిగి ఉండాలని తహసీల్దారు జానకమ్మ అన్నారు. చినబొడ్డేపల్లి గ్రామంలో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌరహక్కులపై అవగాహనతోనే న్యాయం పొందవచ్చన్నారు. స్వేచ్ఛగా జీవించే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు. ఎవరైనా హక్కులకు భంగం కలిగిస్తే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైల శివరామ్, వార్డెన్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో చదువుపై ఆసక్తి



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడంపై సాధన చేయించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు.

ఘనంగా వరమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి పూజలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్

పాయకరావుపేట : చిట్టూరి మెట్రోలో వేంచేసిన శ్రీ వరమహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవచనం, నిత్యోపాసన, శ్రీ వరమహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ స్వామి వార్షిక కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు



కొరుప్రోలు ఆర్బీకేలో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గోపాలం

ఎస్.రాయవరం : గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కొరుప్రోలు సర్పంచ్ కొరుపాటి గోపాలం అన్నారు. రైతు భరోసా కేంద్రంలో పలువురు రైతులకు బుధవారం పచ్చిరొట్టు ఎరువులైన జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలు అందజేశారు. అవసరం ఉన్న రైతులు పొలం పాస్ పుస్తకం పట్టుకుని రైతు భరోసా కేంద్రంలో ముందుగా నమోదు చేసుకుని అవసరమైన నగదు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్సాహేబుపేటలో 'గడప గడపకు' నేడు

కోటవురట్ల : చినబొడ్డేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని ఆక్సాహేబుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతోపాటు, స్థానిక సమస్యలు తెలుసుకుంటారని వెల్లడించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

పొగాకు అనర్థాలపై ఊరూరా అవగాహన

యలమంచిలి : ప్రతి ఒక్కరు పొగాకుకు దూరంగా ఉండాలని యలమంచిలి సీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణం, మండలంలోని రేగుపాలెం పీహెచ్‌సీ కేంద్రాల్లో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ పొగాకు నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పొగ త్రాగటం ద్వారా శ్వాస సంబంధిత టీబీ, కేన్సర్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. పొగాకుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పొగ త్రాగితే వచ్చే అనర్థాలను వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించాలని కోరారు. యలమంచిలి సీహెచ్‌సీ వైద్యాధికారులు ఆధ్వర్యంలో పొగాకుకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ నిర్వహించారు. రేగుపాలెం గ్రామంలో వైద్య సిబ్బంది పొగాకుకు దూరంగా ఉండాలని గ్రామంలో ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి వైద్యాధికారులు, రేగుపాలెం సీహెచ్‌సీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మునగపాక : పొగాకు ప్రాణాలకు నష్టం కలిగిస్తుందని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి వినోద్‌కుమార్ హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు పీల్చడం ద్వారా ఆరోగ్యం చెడిపోతుందన్నారు. గుండె సంబంధిత రోగాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకుకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైద్యాధికారి తరణి, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, ఆరోగ్య సహాయకులు శరగడం అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



రేగుపాలెం పీహెచ్‌సీ వద్ద పొగాకు నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్యాధికారులు



చూచుకొండ పీహెచ్‌సీ ఎదుట నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం : పొగాకు త్రాగడం మానేసి, క్యాన్సర్‌కు దూరంగా ఉండాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పీహెచ్‌సీ పరిధిలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు త్రాగడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధిలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పి.ధర్మవరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్థానికులకు అవగాహన కల్పించారు.

రాంబిల్లి : మత్తు పదార్థాల జోలికి పోయి ప్రమాదాల బారిన పడవద్దని దిమిలి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ యస్.బాల హెచ్చరించారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది బుధవారం ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు, పొగ తాగవద్దు.. ఊపిరితిత్తులను కాల్చుకోవద్దు అంటూ నినాదాలు చేశారు. చుట్ట, బీడీ, సిగరెట్ జోలికి పోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో ఎస్ఎస్‌వీఎన్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్లు కె.ఈశ్వరి, సీహెచ్ ధనరాజు, అరుణకుమారి, ల్యాబ్ టెక్నీషియన్ వి.అప్పలరాజు పాల్గొన్నారు.



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



యలమంచిలి పట్టణం సీహెచ్‌సీలో పొగాకు నిషేధంపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పి.ధర్మవరంలో పొగాకు అనర్థాలను గ్రామస్తులకు వివరిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన



చినబొడ్డేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. చినబొడ్డేపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలిచ్చారు. సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పథకమైనా కావాలంటే అర్హత ఉన్నా కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. రాజకీయ దళారులు దరఖాస్తుదారుల్ని పట్టి పీడించేవారన్నారు. ఇపుడా పరిస్థితి లేదని, అర్హత ఉంటే.. వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎలాంటి రాజకీయాలకు తావులేకుండా, కుల, మత, తరతమ భేదాల్లేకుండా పథకాలు అందుతున్నాయా? లేదా? అని స్థానికులను ప్రశ్నించారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, వైఎస్సార్ జగనన్న ఇళ్లు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పారదర్శకంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఎటువంటి ఆర్భాటం, హడావుడి లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని కొనియాడారు. గతంలో ఇన్ని సంక్షేమ పథకాలు, ఇంతలా నేరుగా బ్యాంకు ఖాతాలకే లబ్ధిని చేకూర్చినవారెవరైనా ఉన్నారా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ అన్ని వర్గాలకు అన్నలా, మేనమామలా, కొడుకులా ఆదుకుంటున్నారన్నారు. పల్లెల్ని కూడా పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చెందేందుకు సీఎం జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సంక్షేమం మీకు జీవిత కాలం కావాలంటే మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా ఆశీర్వదించాల్సిందిగా అభ్యర్థించారు. ఆయన సీఎం అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని, పేదరికం దూరమవుతుందన్నారు. మోసగాళ్ల మాటలు వినొద్దని సూచించారు. చంద్రబాబు ఎటువంటి మోసకారో ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. గతంలో హామీలు గుప్పించి ఎలా మోసగించాడో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. మళ్లీ మోసగించేందుకు కొత్త ప్లాన్‌తో సిద్ధమవుతున్నాడని, తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, సర్పంచ్ పైల శివరామ్, ఎంపీడీవో చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బాలేపల్లి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : స్థానిక మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మండల పరిషత్ హాలులో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకుంటూ గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేలా కృషి చేయాలన్నారు. గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతిని సమావేశంలో చదివి వినిపించారు. కొంతమంది సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ తాగునీరు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణపై సర్పంచ్‌లు, అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

వేట సమయంలో జాగ్రత్తలపై అవగాహన



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ అధికారులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : సముద్రంలోకి వేటకు వెళ్లిన తర్వాత ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్ని జాగ్రత్తగా ఎదుర్కొనే నైపుణ్యం మత్స్యకారులకు ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.లక్ష్మణరావు అన్నారు. బుధవారం పూడిమడకలో పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా బేసిక్ లైఫ్ సపోర్టు అనే అంశంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సముద్రంలో వేట సమయంలో ప్రాణపాయ స్థితి ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రెస్క్యూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన భారత్ కొండలరావు, వీఎఫ్ఏలు అప్పలనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వల్లభనారాయణుడి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి

రాంబిల్లి : దిమిలిలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు, గోపాలకృష్ణ శాస్త్రోక్తంగా కల్యాణ వేడుకను జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి, స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు



పరీక్షా సామాగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

నక్కపల్లి : నక్కపల్లి హైస్కూల్ కేంద్రంగా శుక్రవారం నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ రాజీలలిత తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ సదుపాయాలతోపాటు వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షా సామాగ్రిని ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచినట్టు తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే ఇన్విజిలేటర్లకు గురువారం శిక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 8 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. మండల మేజిస్ట్రేట్ వారి ఆదేశాల మేరకు పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించినవారిలో పరీక్షల విభాగాధిపతి వై.అప్పారావు, ఉపాధ్యాయుడు ఎస్.వి.ఎస్.ఆచార్యులు, గురుకుల పాఠశాల పరీక్షా అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక : చట్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని పల్లపు ఆనందపురంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. చిన్నచిన్న సమస్యలను స్థానికంగా పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఈవోఆర్డీ ఈశ్వరరావు, సర్పంచ్ కర్రి అప్పయమ్మ, వైఎస్సార్‌సీపీ నేత అల్లవరపు రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బాబ్జి

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఉన్నత విద్య అభ్యసించిన తర్వాత లభించే ఉద్యోగ అవకాశాలపై అచ్యుత కళాశాల అధ్యాపకుడు బాబ్జి విద్యార్థులకు వివరించారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాల్లో భాగంగా 24వ రోజైన బుధవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు తరచూ గ్రంథాలయాలకు వెళ్లి, అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అభ్యసించాలని సూచించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశుని విగ్రహ ప్రతిష్ట



నూతన ఆలయంలో ప్రతిష్టించిన వేంకటేశ్వరస్వామి ఏకశిలా విగ్రహం



ఆలయ ప్రారంభోత్సవంలో కోలాటమాడుతున్న మహిళలు

ఎస్.రాయవరం : సైతారుపేట గ్రామంలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారానికి, గ్రామస్తుల ఆర్థిక సాయం తోడై ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన ఆలయంలో స్వామివారి ఏక శిలా విగ్రహం ఏర్పాటు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు నిర్వహించి, చిరుధాన్యాలు అభిషేకించి స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా మహిళలు కోలాటం ఆడారు. సైతారుపేట పరిసర గ్రామాలు సర్వసిద్ధి, పేటసూది పురం, జేవీ పాలెం తదితర గ్రామస్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాలు సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగాయి.

వలంటీర్ల పాత్ర కీలకం



సత్కారం పొందుతున్న తిమ్మరాజుపేట వలంటీర్లు

మునగపాక : వలంటీర్ల పాత్ర ఎంతో కీలకమైందని తిమ్మరాజుపేట సర్పంచ్ కాండ్రేగుల జగన్ అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధిగా పని చేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం అందించేలా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, సచివాలయ కన్వీనర్ సూకరత్నం, పాలకవర్గ సభ్యులు మల్ల అప్పలనాయుడు, కాండ్రేగుల జగన్మోహనరావు, ముప్పిడి కన్న, శరగడం ఈశ్వరమ్మ, మాటూరి అప్పలనర్స, పుష్ప, వైఎస్సార్‌సీపీ నేత ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతోనే సౌకర్యాలు



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం(అనకాపల్లి) : జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో కూలీలకు అందిస్తున్న సౌకర్యాలు పాత పద్ధతిలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉప్పవరం, మల్లవరం, జగన్నాథపురం, నరేంద్రపురం గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. సంఘటితంగా పోరాడి పాత పద్ధతిని అవలంబించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లక్ష్మణ, ధనుంజయ్, హరీష్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న మునగపాక-3 ఎంపీటీసీ గణేష్

మునగపాక : స్థానికుల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం బుధవారంతో ముగిసింది. గత 45 రోజులుగా గ్రామస్తులు మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఎదుట వేసవి దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. పూడిమడక రోడ్డులో రాకపోకలు సాగించే ప్రజలు ఈ మజ్జిగ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆఖరి రోజున మునగపాక-3 ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ తన నకుమారుడు వీరభద్ర జన్మదినం సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహనరావు, ఏంపీటీసీ-2 సూరిశెట్టి రాము, గ్రామ పెద్దలు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, వెలగా రామకృష్ణ, వేగి సాయిబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి వలంటీర్ల విరాళం



తిమ్మరాజుపేట రామాలయం నిర్మాణానికి విరాళం అందిస్తున్న వలంటీర్లు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట వలంటీర్లు తమ దైవ భక్తిని చాటుకున్నారు. తిమ్మరాజుపేటలో రామాలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాతలు ఆలయ అభివృద్ధికి అవసరమయ్యే ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారు. దీనిలో భాగంగా గ్రామానికి చెందిన 15 మంది వలంటీర్లు రూ.వెయ్యి వంతున రూ.15 వేల విరాళాన్ని బుధవారం సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్‌లకు అందించారు.

రైతు సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి రైతు సంఘ నూతన కార్యవర్గం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. అధ్యక్షునిగా మళ్ల సంజీవి ఎన్నికయ్యారు. సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ మాట్లాడుతూ కేంద్రం రైతులకు వ్యతిరేకంగా అమలు చేస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సంఘ జిల్లా నాయకులు కర్రి అప్పారావు, కార్యదర్శి వెంకట్, కోశాధికారి మహలక్ష్మినాయుడు, ఉపాధ్యక్షుడు సన్యాశినాయుడు పాల్గొన్నారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

ఎస్.రాయవరం : మండలంలోని పెదగుమ్ములూరు గ్రామంలో రామస్వామి నుంచి బుధవారం 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు చెప్పారు. అక్రమ మద్యం బాటిళ్లు కలిగి ఉన్న రామస్వామిని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ బుధవారం మీడియాకు తెలిపారు.

ఘనంగా నటశేఖరుడి జయంతి



సూపర్ స్టార్ కృష్ణ జయంతి కార్యక్రమంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న అభిమానులు

యలమంచిలి : యలమంచిలి పట్టణం దిమిలి రోడ్డులో బుధవారం నటశేఖర కృష్ణ జయంతి వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. సినీ నటుడు ఘట్టమనేని శివరామ్మకృష్ణ జయంతోత్సవంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. విలక్షణ నటుడిగా, తెలుగు సినీ రంగంలో ప్రయోగాలకు, ఆధునిక సాంకేతికతకు ఆద్యుడిగా, సినీ రంగానికి ఆయన లేని లోటు పూడ్చిలేనిదన్నారు. ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ నటుడిగా, రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందిన ఆయన నటించిన చిత్రాల్లో పాత్రలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా యలమంచిలి పట్టణంలో ఆయన అభిమానులు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు.